

# మన ప్రేమ కథలు

## కేతు విశ్వనాథరెడ్డి

చాలామందికి మల్లే, మా ఆవిడ శోభకు కూడా ప్రేమ కథలంటే చాలాయిష్టం అందులోనూ, నాలాటి సామాన్యుడికి జీవితంలో వూహించుకోవటానికి కూడా వీల్లేని మహోన్నత ప్రేమలూ, త్యాగాలూ, కన్నీళ్ళూ నిండిన ప్రముఖ రచయిత్రి సుగుమంచి రచనాదేవి కథలూ, నవలలూ అంటే శోభ మరీ పడి చస్తుంది యీ యిష్టాలు, పడి చావడాలు తనవరకే పరిమితమయితే బాగుండిపోయేది

అమావాస్యకో పున్నానికో నేనొక కథ రాస్తానా! రాసి యేదైనా పత్రికకు పంపేముందు కథ ప్రతిని చదవమంటానా! తొలి పాఠకురాలు కాబట్టి చదువుతుంది సగటు పాఠకుల్ని చదివిస్తుందో లేదో, చదివి యెట్లావుందో చెప్పమంటే చదువుతుంది అంతవరకు బాగానేవుంది అక్కడే, యెంత అర్ధాంగి అయితే మాత్రం సమయమూ, సందర్భమూ దొరి కాయికదా అని నా యిష్టాలమీద, నేను పడి చచ్చే అభిప్రాయాలమీదా దాడి చేయడమేనా?

'కథలను మరీ యింత సీరియస్‌గా రాయకపోతేనేం? మీ కథల్తో లోకం మారుతుందా-మీ వెర్రిగానీ బావుందను కోండి కానీ లోకంమీద యింత యిది భరించాలంటే యెలా? రచనాదేవిలాగా రాస్తేనే మీ అభ్యుదయం మంటగలిపి పోతుందా? యేంరాసినా పుణ్యమూ పురుషార్థమూ వుండాలి'—యిదీ శోభ దాడి సారాంశం నాకేం తోచక అడుగుతాను 'పోనీ నా కథ చదివిస్తుందా' అని 'చదివించకేం చస్తుందా? యేబిరాసినా, యెలారాసినా యేదో కాలక్షేపానికయినా మాబోటి వాళ్ళు చదవక తప్పదుకదా! ఆ రాసేదేదో ర చ నా దే వి లా గా ' అంటుంది

యీ ప్రముఖ రచయిత్రి సుగుమంచి రచనాదేవి, పంచమాంగ దళ సభ్యురాలైన మా ఆవిడ శోభద్వారా పరోక్షంగా హింసించడం మానేసి వొక రోజు ప్రత్యక్షంగానే నా అంతు చూసింది

ఆ సాయంత్రం నే నింటికి వెళుతూంటే రచన కారు మా గల్లీలో మా యింటి పక్కగా పార్క్ చేసి వుంది, నగరంలో జరిగిన మూడు నాలుగు రచయితల సమావేశాలకు వచ్చిన కారు రచన కారే సందేహంలేదు అయినా యీ విరల్‌వాడి గొందుల్లో ఆమె పరిచితులు యెవరుంటారబ్బా అనుకుంటూ యింట్లో అడుగు పెట్టాను మా యింట్లో రచన!


శోభా, రచనా ఆత్మీయంగా మాట్లాడుకుంటున్నారు మా పాప కిరణ్మయి రచన వొళ్ళో కూచుని ఆవిడ మెళ్ళోని ముత్యాలహారంతో ఆడుకుంటోంది మా అబ్బాయి శ్రీచరణ్, గడగడా మాట్లాడుతున్న రచన నోటివైపు చూస్తూ, అమ్మను అంటి పెట్టుకొని వున్నాడు వాళ్ళు నా రాకను గమనించలేదు చిన్నగా దగ్గాను మా ఆవిడ మర్యాదకు లేచింది వొళ్ళోనుంచీ మూడు నాలుగు పుస్తకాలు కిందపడ్డాయి నేనే వాటిని తీసిచూశాను అవి రచన రాసిన నవలలు ప్రేమపూర్వకంగా మా ఆవిడకు రచన యిచ్చిన అభినందన ప్రతులు

పరిహాసంగా కల్పించుకొన్నాను

"యిన్నేళ్ళుగా తెలిసినవాణ్ణి మీ అంత పెద్ద పేరు లేకపోయినా, కాస్తా కథలు గట్రా రాసేవాణ్ని నాకివ్వకుండా స్వజాతి అభిమానం చూపించారే"

మా ఆవిడ కలుగ చేసుకొని వొక చెణుకు చెణికింది

"మీకిస్తే లాభమేముంది? యేదో మొరటు సామెత చెప్పినట్లు-మొప్పె చేతికి మొగిలి రేకిచ్చినట్లని వీటికి



మీకూ చుక్కెదురుగా"

నాకు నవ్వు వచ్చింది "యెవరన్నారు?" అన్నాను-రచన వైపు చూస్తూ.

రచన యిబ్బందిగా నవ్వింది

"నేను వస్తాను శోభా" రచన వెళ్ళడానికి లేచింది

"అంత తొందరేం? నా రాక యేమయినా ఇబ్బంది కలిగించిందా?" అన్నాను

రాత్రి భోజనం చేసి వెళ్ళమని శోభ రచనను బలవంతం చేసింది

"మా డైరెక్టరూ నేనూ మినిస్టరు గారిని చూడాలి. మరో గంటలో యీ మారెప్పుడయినా తీరికగా వస్తాను. రేపు ఆదివారం మా యింటికి రండి. కారు పంపుతాను"

మీ కారు అక్కరలేదు వచ్చేట్లయితే యే రిక్షాలోనో, సిటీ బస్సులోనో వస్తాం అని జవాబివ్వాలనుకున్నాను జవాబివ్వలేదు

రచన వెళ్ళిపోయింది

ఆ రాత్రి మా వొంటిగది బయటి డాబా బయలులో పడుకున్నా చిక్కటి చీకటి. ఆకాశంలో అక్కడక్కడా కన్పించే చుక్కలు గదిలో పిల్లలను నిద్రబుచ్చి, రచన నవలాలోకంలో శోభ గది బయట ఆ చీకట్లో నా ఆలోచల్లో నేను

రచన మా యింటికి రావటమే విచిత్రంగా వుంది. రచయితల సమావేశాల్లో తారసపడేది యేదో మాటల సందర్భంలో శోభ తన నవలలంటే పడి చస్తుందని చెప్పినట్లు గుర్తు మేముండే వీధి పేరు కూడా చెప్పినట్లు లీలగా జ్ఞాపకం అయినా రచన మాయింటికి యెందుకు వచ్చినట్లు? కారణాలు అంతుబట్టలేదు

యే అర్ధరాత్రికో, శోభ వచ్చి పక్కన్నే పడుకుంటూ, తన్మయత్వంతో

అంది

"త్యాగమయి యెంతబాగా రాసిందండీ అందుకే ఆ పత్రికవాళ్ళు అయిదు వేలు ఫస్టు ప్రయిజు యిచ్చారు చదువుతూంటే గుండెలు అవిసిపోయాయి

"అలాగా?"

"ఆ మధురిమ త్యాగం తలచుకుంటే

అబ్బ అంత త్యాగం ప్రేమించిన వాడు మోసం చేస్తే జీవితాంతం వొంటరిగా బ్రతికింది. మధురిమను ప్రేమించి కూడా శరత్ ఆమెను అన్యాయంచేశాడు. లక్షణంగా పెళ్ళిచేసుకున్నాడు-మరొకర్ని మీ మగాళ్ళంతా యింతే ఆడవాళ్ళ హృదయాలతో ఆడుకోవటమే పని'"

"వేరే పనిలేక!"

"ఆ మధురిమ జీవితం తలచుకుంటే "

"నవల్లోనా?"

"నవల్లోనే మామూలు జీవితంలో మాత్రం వుండరంటారా?"

"వుండరు—స్థిమితంగా తిని కూర్చోడానికీ, యేడ్వటానికీ, త్యాగాలు చెయ్యటానికి తీరికా, డబ్బూ వుంటే తప్ప "

"మీదంతా విచిత్రం ప్రతిదానికీ డబ్బు ముడిపెడతారు-లోకంలో డబ్బుకు మించిన ప్రేమలే వుండనట్లు "

నేనేమీ సమాధానమివ్వలేదు. యేదో జ్ఞాపకానికి వచ్చినట్లు శోభ అంది

"ఆ శరత్‌పాత్ర తల్చుకొనేకొద్దీ మీరే జ్ఞాపకానికి వస్తున్నారు నిజమే నా? మిమ్మల్ని దృష్టిలో పెట్టుకొని రాసినట్లుంది "

"నేనా నవల చదవలేదు"

"అద్దం చదివి వుంటారు అది పోనీండి మనుషులు పోలిన మనుషులుండవచ్చు మీరూ యిలాంటి నవల ఒక్కటి రాయకూడదా! మీరెంతో బాగా రాస్తారని తెగమెచ్చుకుంది — ఆవిడ 'ఆయన రాజకీయాలు విడిచి వోపిక తెచ్చుకొని రాస్తే చాలామంది కంటే బాగా రాస్తార' ని చెప్పింది యీకాలం పత్రికలకు తగినట్లు రాస్తే పోయేదేముంది? డబ్బులూ, పేరూ వస్తాయి సింపుల్‌గావున్నా ఆమె మెళ్ళో ముత్యాలపేట గొలుసు ఎంతబాగుందో!"

రచనల ద్వారాకూడా సంపాదించలేని నా అసమర్థతను శోభ జ్ఞాపకం చేసింది విసుగ్గా అన్నాను

"యింకా నయం ఆమెకారు బాగుందనలేదు "

"అంతదురాశ యేమీ లేదులెండి ఏదో వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడుగా మంచిమంచి నవలలద్వారా నయినా "

"ఆమే, అలాంటివాళ్లా ఆ మంచి మంచి నవలలేవో రెండుచేతులా రాస్తున్నారు కదా? నేనెందుకు రాయటం— అందునా యీ వయసులో " పరిహాసంగా అన్నాను

"ఏమి పెద్ద వయసు? ముప్పయి అయిదేగా! ఆవిడా మీ యీడుదేగా మరి చాను ఆవిడ మనవాళ్ళే నటగా? మీతో పాటు చదువుకుందటగా?"

"కావచ్చు"

శోభ నవ్వు దెప్పింది

"ఎంత అభిమానం లేని మనుషులండీ— ఇంతపెద్ద హైదరాబాదులో మన వాళ్ళను కూడా పట్టించుకోరు పెద్ద రచయిత్రి పెద్ద




వుద్యోగంలో వుంది గర్వంలేదు తన నవల్లోని పేర్లే మన పిల్లలకు పెట్టానని చెబితే యెంత సంతోషించిందని 'ఆయనేమీ అభ్యంతరం చెప్పలేదా అని అడిగింది దేనికీ చెప్పరన్నాను అనుకోండి"

"అయితే నన్నో అవ్యక్తునిగా మీ రచయిత్రిముందు చిత్రించావన్న మాట" నవ్వుతూ అన్నాను

దీనికి శోభ సమాధాన మివ్వ లేదు ఆమెదారి ఆమెదే

"ఇంతసేపూ అసలు విషయం అడగ లేదు మీరేమీ అనుకోనంటే ఒక టడుగు తాను నిజం చెప్పాలి" శోభకాస్తా సీరియస్‌గా అడిగింది

"అడుగు నీదగ్గర నేనేం దాచుతున్నాను కాబట్టి"

"ఎంతయినా మగవాళ్ళు ఒకప్పుడు ఆమెను మీ కివ్వాలనుకున్నారటగా"

"నిన్నుకూడా నాకివ్వకముందు చాలా మందికి యివ్వాలనుకున్నారు కదా మీ వాళ్ళు?"

"ప్రతి ఆడపిల్లకు ఆ తిప్ప లే వో తప్పవు"

"ఈదేశంలో తిప్పలకు ఆడామగా తేడా లేదు యెక్కువా తక్కువా అంతే"

"ప్రతీదానికీ వేదాంతం మాట్లాడుతారు అదిసరే రచనను మీరెందుకు చేసుకోలేక పొయ్యారు?"

"ఆవిడనే అడక్కూడదా?"

"అదేం మర్యాద!"

"పోనీ నువ్వెందుకు ఆ యింజనీరు నెవర్నో చేసుకోలేక పొయ్యావు?"

"దానికీ దీనికీ సాపత్యమేముంది?"

"ప్రతి దానికీ వుంటుంది."

"మానాన్న అంత కట్నం యివ్వలేక పోయాడు."

"అదీ ఒకరకంగా యింతే."

"వాలి అడిగారా?" శోభ నవ్వడం మొదలు పెట్టింది.

నవ్వు ఆపి మళ్ళీ అదే ప్రశ్న వేసింది.

"మీకేం మగ మహారాజులు. చెప్పండి రచన సంబంధంఎందుకుతప్పిపోయింది?"

చుక్కల వైపుచూస్తూ అన్నాను:

"మాకు ఆస్తిలేదు. నాకా రోజులలో వుద్యోగం లేదు."

"ఈవిషయంముందేవాళ్ళకుతెలియదా?"

"తెలుసు. కానీ ఆరోజుల్లో గ్రూప్ఒన్ సర్వీసెస్ పరీక్ష వ్రాసయ్యాను. ఆ వుద్యోగమేదో రావచ్చునని ముందుకు వచ్చారు. అది రాలేదు. మానుకున్నారు."

"ఎందుకు?"

"పై కిలాగేనాధుడులేక"కసిగాఅన్నాను.

"అలాగా ...రచనను మీరు ప్రేమించారా....నిజం చెప్పండి?"

"ప్రేమించానో లేదో చెప్పలేను గానీ చేసుకుంటే బాగుంటుందని ఆ రోజుల్లో అనుకున్నా."

"ఆవిడ మిమ్మల్ని ప్రేమించిందా?"

"నాకా సంగతి తెలియదు. తర్వాత తర్వాత తెలుసుకున్నంత వరకు ఆవిడ యెవర్నీ ప్రేమించలేదని మాత్రం తెలుసుకున్నాను—తననూ, డబ్బునూ తప్ప."

"అట్లా కనిపించదే."

"ఆమె అట్లా కనిపించక పోవటం నాతప్పు కాదు. మనిషికి రకరకాల రూపాలుంటాయి."

"పోనీండి. ఈ విషయాలు నాకెందుకు యెప్పుడూ చెప్పలేదు. దాచారంటే ఏదో వుంది."

శోభ కంఠంలో యేమార్పూ కనిపించ లేదు. కళ్ళనుబట్టి గమనిద్దామా అంటే చీకటి. నాగుండె గూడు కదిలింది. అసహనంగా అన్నాను:

"నేను కారణంకాని నా ఆర్థికదుస్థితుల మూలంగా ఎవర్నో పెళ్ళి చేసుకోలేక పోయానని చెప్పలేదంటావా? నేను పనికి రానని యే లక్షాధికారినో డబ్బుతప్ప నా కంటే అన్నివిధాల అధముణ్ణి రచన పెళ్ళి చేసుకుంది అని యేడవలేదంటావా?అందరి జీవితాల్లోనూ ఎదురయ్యే సవాలక్ష సంఘటనల్లో యిదీ వొకటి. ఇంతకంటే ఘోర మైనవి వున్నాయి. నా చదువే ఆవిడా చదివింది. ఆవిడ ఒక శాఖలో డెప్యూటీ డైరక్టరు. నేను పదిహేనేళ్ళనుంచీ వొట్టి యు. డి. సి. ని. నువ్వూ ఆవిడలాంటి ఆడదానివే. నీకు దొరికిన భర్త మామూలు మనిషి-కానీ ఆవిడకు దొరికిన భర్త నాలాటి వుద్యోగుల్ని, రచయితల్ని వందమందిని కొనగలిగే సినిమా ప్రొడ్యూసరు. డబ్బు వున్నవాళ్ళు—అవకాశాల్ని వాళ్ళు రాబట్టుకోగలరు—అంతే"

"నాకిప్పుడు తెలిసింది-రచన అట్లాంటి ప్రేమ కథలెందుకు రాసేదీ—మీరెందుకు రాయందీ. ఏమోలెండి యీ గొడవలెవరికి కావాలి? ఈమాత్రం తిండి దొరికే బ్రతుకులూ, ప్రేమలయినా దక్కితే చాలు—మనలాంటి వాళ్ళకు."

శోభ నన్ను బల్లిలా అంటుకుంటూ అంది—సానుభూతితోనో, సంతృప్తితోనో, విశ్వాసంతోనో, తన ఆధారం జారిపోతుందేమో అనే ఆందోళనతోనో;

ఆ చిక్కటి చీకట్లో చుక్కల మసక మసక వెలుగు